
# పరిష్కారం


## -పి.వి.బి. శ్రీరామమూర్తి




**మూడు రోజుల** క్రితం నుండి ప్రారంభ మయిన చిన్నచిన్న చినుకులు పెరిగి పెరిగి కుంభ వృష్టిగా మారింది. లోకమంతా దట్టమైన చీకటితో నిండి ఉంది. ఈ చెట్టు మీద కాకి ఆ చెట్టు మీదికి కాని, ఈ గుమ్మంలో మనిషి ఆ గుమ్మంలోనికి కానీ వెళ్ళేందుకు వీలులేని జడివాన. పెద్ద పెద్ద చెట్లు కూకటి వేళ్ళతో పెల్లగిలి నేలకి ఒరిగి పోతుంటే, కొన్ని చెట్లకు పెద్ద పెద్ద కొమ్మలు విరిగి ప్రవాహంలో కొట్టుకు పోతున్నాయి. వాన రానురాను ఉధృతమై భయోత్పాతాన్ని కలిగిస్తూంది.

సరిగ్గా ఇలాంటి పరిస్థితే అవధానులగారింట్లోనూ ఎదురైంది. అవధానులగారికి వారం రోజులుగా పీడిస్తూన్న జ్వరం ఎన్ని మందులు వాడినా తగ్గకపోగా మరి కొంచెం అధికమైంది. డాక్టరు వస్తూనే ఉన్నాడు. మందు లిస్తూనే ఉన్నాడు. అవధానుల చేతికి, ముక్కుకి ఇస్తున్న ఇంజక్షను కన్నాలుఆకాశంలో నక్షత్రాల్లా లెక్కలేనన్ని కనిపిస్తున్నాయి. అవధానులు గారి చిన్న కొడుకు సోమేశానికి అవధాన్లు బతుకుతా రన్న ఆశ పూర్తిగా హరించుకు పోయింది.

అవధానులుగారికి అయిదుగురు మగ సంతానం. ఇద్దరు కూతుళ్ళు. పెద్దవాడు డి. హెచ్చెమ్మెస్ అయి అమలాపురంలో అత్తవారి వూరిలో సెటిలయి ప్రయివేట్ ప్రాక్టీసు పెట్టుకున్నాడు. చిన్నవాడు విశాఖపట్నం గవర్నమెంట్ హైస్కూల్లో హెడ్ మాస్టర్‌గా పనిచేసి ఎమ్మే కట్టి ప్రస్తుతం ఆ జిల్లాలోనే లెక్చరరుగా ఉంటున్నాడు. మూడో వాడు బి ఎస్సీ అయి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా తిరుగుతూ ప్రస్తుతం ఒక మెడికల్ షాపులో వాటాకూడా సంపాదించి అత్తవారింట కాకినాడలో ఉంటున్నాడు. నాలుగో కొడుకు శ్రీకాకుళం జిల్లాలో




చీపురుపల్లి తాలూకాఫీసులో గుమాస్తా. నలుగుర్ని బాగా చదివించి ఇద్దరాడ పిల్లలకి పెళ్ళిళ్ళు చేసిన అవధానిగారు అయిదవ సంతానం కడగొట్టు వాడయిన సోమేశం చదువయేసరికి అన్ని రకాలుగా ఇబ్బందులకు గురయారు. ఆఖరి కొడుకు స్కూలు ఫైనలు పాసయి కాలేజీలో చేర్పించ బోయే సమయానికి భార్య అకస్మాత్తుగా కన్ను మూసింది. ఇద్దరి కూతుళ్ళ పెళ్ళిళ్ళు, పురుళ్ళు వాటికయే అప్పులు భార్య మరణానంతరం కర్మల కయ్యే ఖర్చులు ఇలాటి అప్పుల వల్ల ఆర్థికంగా, బాగా కుంగి పోయారు. నలుగురు కొడుకుల్లో ఎవరూ సోమేశం చదువు గురించి 'ఏం చేద్దాం? అనికూడా అడక్కపోయేసరికి అవధానిగారి మనస్సు గాయపడింది.

ఆ కోపంతో సోమేశం చదువు ప్రసక్తి వాళ్ళ ముందు తేలేదు. ఆత్మాభిమానం కలవాడవటం చేత సోమేశం కూడా పై చదువులు చదువుకోవాలన్న కోరికను వాళ్ళముందుంచ లేదు. తరవాతఎంప్లాయిమెంటు ద్వారా సంవత్సరం తరవాత మలేరియా వర్కరుగా ఇంటర్వ్యూ వస్తే వెళ్ళాడు. జీతం తక్కువయినా పిలిచి ఇచ్చిన ఉద్యోగం కాబట్టి వెంటనే చేరాడు. తరవాత తన వూర్లోకి బదిలీ చేయించుకున్నాడు. ఆ దక్షత కోసం అవధానిగారు సోమేశానికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేశారు. పెళ్ళి చేసిన తరవాత అవధాన్లుగారికి మనసులో ఒక భయం పట్టుకుంది. కొత్త కోడలు కాస్త గడుసు దయితే మామగారు పూర్తిగా ఆఖరి కొడుకు దగ్గరే ఉండటానికిఅభ్యంతరం చెబుతుందేమోఅనుకున్నారు. మరి కోడలి మంచితనమో, కొడుకు పరిస్థితుల్ని వివరించి చెప్పడం వల్లనే సర్దుకు పోయిందో తెలీదు. కానీ అవధానుల భయానికి ఆస్కారం లేకుండా చేసింది.

పెళ్ళయిన కూతుళ్ళు అప్పుడప్పుడూ వచ్చి వదిన ఏమంటుందో అనయినా ఆలోచించక 'అది కావాలీ, ఇది కావాలీ, అని తీసుకుపోయినా కోడలు మాత్రం అభ్యంతరం చెప్పదు. ఉదయాన్నేలేవటం, కోనేటి కెళ్ళి స్నానం చేసుకుని ఇంటికి రాగానే రెండు గంటలు జపం చేసుకోవటం అనంతరం కోడలు తనకి సిద్ధంగా ఉంచిన కాఫీఫలహారాలు సేవించటం అవధాని దినచర్య. కొన్నాళ్ళు పౌరోహిత్యానికి వెళ్ళి ఫలం పుష్పం సంపాదించేవారు. కానీ కొడుకూ కోడలూ మరి మీకు శక్తి లేదు. వెళ్ళద్దని మొరాయించటంతో పౌరోహిత్యం మానుకున్నారు. కన్న కూతుళ్ళ కంటే అధికంగా కోడలు తన సేవలు చేస్తుంటే అవధానిగారి కళ్ళు చెమ్మగిల్లేవి. మీ అత్తమ్మ ఎంత దురదృష్టవంతురాలమ్మా. నీ లాటి కోడల్ని చూడకుండా కన్ను మూసింది' అనుకునేవారు. అవే ఆలోచనలు ఆయనలో పెనుగాలుల్లా వీస్తున్నాయి. ఒంటిమీద తెలివి లేకుండా పడి ఉన్న తండ్రిని చూస్తే సోమేశానికి భయం పట్టుకుంది. రెండు రోజుల క్రితమే తండ్రి పరిస్థితేం బాగు లేదని అన్న లందరికీ టెలి గ్రాంలు పంపాడు. ఇంకా ఎవరూ రాలేదు.

వర్షం రానురానూ అధికమయింది. చెరువులు పూర్తిగా నిండిపోయి గండి పడిపోతున్నాయి. వూరు నిండా మోకాటి నీరు. కప్పల బెకబెకలు. కొంచెం సేపు అయ్యేసరికి హోరున గాలి. పిడుగు పడిన శబ్దం. అదే సమయంలో తలుపు తట్టిన శబ్దం విని ఎవరా అని తలుపు తీస్తే శ్రీకాకుళం నుంచీ,విశాఖపట్నం నుంచి వచ్చిన ఇద్దరన్నయ్యల్నీ చూసిన సోమేశానికి ప్రాణం లేచివచ్చినట్లయింది. భార్యా పిల్లలతో రావటం మరింత గుండె నిబ్బరం కలిగింది సోమేశానికి. ఆ సాయంత్రానికల్లా మరో అన్నయ్యా వచ్చాడు. అవధాన్లుగారూ కాస్త కళ్ళు తెరిచి, తెలివి తెచ్చుకుని వచ్చిన ముగ్గురు కొడుకుల్నీ ఒకసారి చూసి 'పెద్దాడు రాలేదా ' అన్నారు.

"బంగాళాఖాతంలో వాయుగుండంట. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకి తుఫాన్‌ను తాకిడి హెచ్చుగా ఉండట. అందునుంచి అది తగ్గితేనే కానీ, అన్నయ్య రావడానికి కుదరదు, నాన్నా!" అన్నాడు రెండో కొడుకు.

'వాడికి ఒట్టి రోజుల్లోనే తండ్రిని చూడడానికి తుఫాను. అలాటిదీ . తుఫానులో వేరే చెప్పాలా' అద్దాల నాడు బిడ్డలు కానీ, గడ్డాలొచ్చాకనా' పైకి అనాలనుకునే ఆ మాటలు అనటానికి అతని మనసు అంగీకరించ లేదు. భారంగా కళ్ళు మూసుకుని—"డెబ్బయి దాటితే కానీ ఆ యముడికీ నన్ను తీసుకుపోవడానికి భయమేరా. అయినా ఈ ముసలి ప్రాణం ఇంకా ఎందుకుచెప్పండి" అన్నారు.



"అదేంటి, నాన్నా, ఆ మాటలు. మీ కేం చెట్టంత కొడుకులం మేం ఉండగా" అన్నాడు రెండో కొడుకు. "కళ్ళు మూసుకుని ధైర్యంగా పడుకోండి. మీ కే భయం లేదు." ధైర్యం చెప్పాడు మూడో కొడుకు.

ఆ సాయంత్రానికి ఇద్దరు కూతుళ్ళూ, అల్లుళ్ళూ పిల్లలతో దిగారు. ఇల్లొక ధర్మసత్రంలా ఉంది. ఎవరికి కాఫీ లందుతున్నాయో, లేదో తెలీటం లేదు అన్న పూర్ణకి. ఎంద రొచ్చినా విసుక్కోకుండా గాడిద చాకిరీ చేయటం అన్న పూర్ణకి సవతి తల్లి నేర్పిన విద్య. కష్టాలన్నీ పుట్టింటే అనుభవించేసిన అన్న పూర్ణకి ఈ కష్టా లో కష్టాల్లా కనిపించవు. బాధ్యతల్లా తప్ప. ఎవరయినా పై వాళ్ళు అన్నపూర్ణ కష్టాన్ని చూసి సానుభూతి చూపించినా అన్న పూర్ణకి సహించదు. ఎన్ని జన్మల్లోనో చేసిన పాపాలకి చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకుంది. సవతితల్లి పోరుతో విసిగిపోయింది. అందునుంచి భర్తనే దైవంగా చూసుకుని ఆ దైవానికి దైవం అయిన మామగారిని దైవ సమానంగా చూసుకోవటం అన్న పూర్ణ దినచర్య అయింది.

రెండు రోజులు గడిచి పోయాయి.

తుఫాను ప్రమాదం తప్పింది. జడివాన పూర్తిగా తగ్గిపోయింది. సూర్య తేజస్సు మబ్బుల్ని మాయం చేసింది. అవధానులుగారు అపస్మృత నుంచి అలానే కోలుకుంటున్నారు. నీరసం బాగా ఉంది. లేవడానికి శక్తి లేక అలానే మగతగా నిద్ర పోతున్నారు. అప్పుడే ఇంట్లోంచి వస్తున్న గోల నుంచి అస్పష్టంగా కొన్ని మాటలు ఆయన చెవిన పడుతున్నాయి.

"అది కాదొదినా! ఏం చిన్నవాడు కదా. వాడి నెత్తినే రుద్దకపోతే "నాన్నా! నా ఇంటికి రా. కొన్నాళ్ళుండు" అని అన్నయ్యలు కానీ, 'మామయ్యగారూ! మాతో బయలుదేరండి' అని మీరు కానీ మాట వరసకయినా ఎప్పుడయినా అన్నారా?' అని చిన్న కూతురు నతాయిస్తూంది.

"ఏం మేం బొట్టు పెట్టి పిలవాలా ఏం? ఆయనే రాకూడదా చిన్న కొడుకే కొడుగ్గానీ తక్కినాళ్ళు కొడుకులు గాదా ఏం తక్కిన మనవలు మనవలు కాదా" అని అంటూంది రెండో కోడలు.

"అయినా ఉన్నన్నాళ్ళూ అత్తగారూ, ఇప్పుడు మావగారూ ఎప్పుడూ సోమేశాన్నే పంచ ప్రాణాలుగా చూసుకున్నారు కానీ, తక్కినాళ్ళ మీద ఆయన కంత అభిమానం ఎక్కడిదీ?' మూడో కోడ లంది.

"ఆ మాటలంటే ఒప్పుకోను. మీ రెవరయినా పిలిచారా? మీ రెవరైనా రమ్మనమని మాట మాత్రంగా నయినా అంటే కదా ఆయన రాలేదని నింద వేయటానికి! నాన్నకి ఆత్మాభిమానం ఎక్కువ. ఎంత కష్టాన్నీ తనలోనే దిగమింగు తారు కానీ ఎవరికీ చెప్పుకోరు." పెద్ద కూతు రంది.

"నెలకి వంద పంపుతున్నాంగా. పేరుకే చిన్నవాడింట్లో ఉండేది." అంటూంది మరో కోడలు.

ఇలా సాగుతున్న సంభాషణ అవధానులుగారికి తీవ్ర అసంతృప్తిని కలిగించింది. అంత అసంతృప్తి లోనూ సోమేశం గొంతు కానీ, అన్న పూర్ణ మాట కానీ వినిపించక పోవటం ఆయనకి కొంత సంతృప్తిని కలిగించింది.

అవధానుల మనసు ఆవేదనతో నిండి ఉంది. 'తను సోమేశానికి చాలా అన్యాయం చేశాడు. పెద్దవాళ్ళందర్నీ బాగా చదివించి చివరికొచ్చేసరికి కాళ్ళు తేలేశాడు. చాలీ చాలని ఈ జీతంతో ముగ్గురి పిల్లల చదువులూ, తనకి మందులూ—ఇల్లు గడపటం సోమేశానికి చాలా కష్టమే.

ఆలోచిస్తున్న అవధానులుగారికి చాలా సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన కళ్ళ ముందు లీలగా కదిలింది.

అప్పుడు—'

అవధాని తండ్రి యాజులుగారి ఆబ్దీకం. యాజులుకి తండ్రి గడించిన ఆస్తి పైసా లేకపోగా బోలెడంత దరిద్రం, గంపెడు సంసారం, వూరినిండా అప్పులూ మిగిలాయి. వీటన్నింటినీ వూరి పౌరోహిత్యంతో నెట్టుకు రావటం కష్టమే అయింది. ఆ పరిస్థితుల్లో పక్క వూళ్ళ పౌరోహిత్యం చేపట్టి అవధానుల్ని తనతో తిప్పుకున్నాడు నాలుగు రాళ్ళు సంపాదించటం మొదలు పెట్టాక తరవాత ముగ్గుర్నీ బాగా వృద్ధిలోనికి తీసుకొచ్చి నాలుగు రాళ్ళు సంపాదించుకునే ఉద్యోగాల్లో దూర్పించాడు. రెక్కలొచ్చిన పక్షులు ఎగిరి పోయినట్టు ఎవరి మానాన వారు వెళ్ళారే కానీ తండ్రిని కానీ, పెద్దాడయిన అవధానుల్ని కానీ పట్టించుకోనే లేదు. ఆ విచారంతోనే యాజులు కన్ను మూశాడు.


తండ్రి తద్దినం చేయటం కోసం ప్రతి సంవత్సరం అన్నదమ్ముల్లో తగాదాలు వస్తుండేవి. ఈ సంవత్సరం నా ఇంట పెట్టడానికి నాకు కుదరదని ఒకరంటే, నాకూ కుదరదని మరొకరని, చివరకు ఎవరింటనో జరిగినా దాని కయే ఖర్చుల కోసం ఆ రోజు సాయంత్రం లెక్కలకి కూర్చునే వారు.

అవధానులగారి కిది చాలా అసహ్యంగా కనిపించింది. 'మన కోసం రక్తం ధారపోసిన తలిదండ్రులకి ఋణాలు చెల్లించడాని కింత రాద్ధాంతమా' అనుకున్నాడు. అప్పటినుంచి ఒక నిర్ణయాని కొచ్చి 'ఒరేయ్! మీ అందరికీ ఒక మాట చెప్పాలనుకుంటున్నా మళ్ళీ సంవత్సరం నుండి నాన్నగారి ఆబ్దికం కోసం మీ రెవరూ తగూలు పడనవసరం లేదు. మనం ఇలా తగూలు పడి ఆ తద్దినం చేసినా ఆయనకి తృప్తి ఉండదు. నా రెక్కల సత్తువ ఉన్నంతకాలం ఆ కార్యం నేనే చేయదలుచుకున్నాను. మీ కిష్టమయితే ప్రతి సంవత్సరం నా ఇంటికే వచ్చేయండి. లేదా ఆ కార్యం చేయుటం మానేసినా ఫరవాలేదు' అని అనేసి సర్రున అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయారు. అక్కణ్ణించి ప్రతి సంవత్సరం అవధానులుగారే తండ్రి ఆబ్దికం జరిపించే వారు.

ఇది గుర్తొచ్చిన అవధాన్లు తండ్రి చేసిన తప్పే తనూ చేస్తున్నట్లనిపించింది. తండ్రి పెద్దాడికి అన్యాయం చేస్తున్నానని బాధ పడేవాడు. తను సోమేశానికి అన్యాయం చేశాడని బాధ పడుతున్నాడు.

తన కంఠంలో ప్రాణం ఉంది కాబట్టి భార్య తద్దినాలకి తగువులు ప్రారంభం కాలేదు. రేపు తన అనంతరం తండ్రికి జరిగిన పరిస్థితే తనకీ జరగటం, తనలాగే సోమేశం ప్రవర్తించటం జరగక తప్పదు.

దీనికి పరిష్కారం ఏమిటి? ఆ రాత్రంతా అతని కంటికి కునుకు రాలేదు. తను చనిపోయినట్టు,




సంవత్సరీకాలకి డబ్బు కోసం కొడుకులు తగువులు పడినట్టు, పౌరుషంతో అప్పు చేసి సోమేశమే ఆ కార్యభారం నెత్తిపై వేసుకున్నట్టు కలలు. పీడ కలలు!

అసలెందు కీ పితృ కార్యాలు? తక్కిన కులాల్లో లాగా ఏ సంక్రాంతికో బ్రాహ్మడి కింత దానం చేసేస్తే సరిపోలేదా? అతని మనసు పరిపరి విధాల పోయింది.

రెండు రోజులకి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. తండ్రిని చూడడానికి రాలేకపోయిన కారణాలు వివరిస్తూ పెద్దకొడుకు నుంచి ఉత్తరం వచ్చింది. వెంటనే తండ్రి ఆరోగ్య విషయం తెలిపరచమనీ రాశాడు.

అవధానులు నవ్వుకున్నారు.

ఒక్కొక్కరూ వెళ్ళిపోయారు. వెళుతూ అల్లుళ్ళూ, కూతుళ్ళూ, కొడుకులూ అతని చేతిలో కొంత డబ్బు ఉంచారు. విసిరి కొట్టాలనుకున్నారు. కానీ ఏదో ఆలోచన తటిల్లతలా మనసులో మెరిసి డబ్బు అందుకున్నారు.

మరో నెలకి అతని ఆరోగ్యం బాగా కుదుటపడింది.

సోమేశాన్ని పిలిచి, అన్ని జాగ్రత్తలూ చెప్పి కంట తడి పెట్టారు. సోమేశానికి ఏం అర్థం కాలేదు. తరవాత అన్నారు— "నేను పెద్దవాడి దగ్గర కొన్నాళ్ళుండి వస్తాను" అని. కోడలూ, కొడుకూ ఎంత వారించినా వినలేదు. ఆయన బయలుదేరినప్పుడు అన్నపూర్ణ మనసు విలవిల లాడిపోయింది. ఆరోగ్య విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల్ని పదే పదే వల్లిస్తూ మామగారిని సాగనంపింది.

ఆ తరవాత నెల రోజులకి—

ఒక రోజు పన్నెండు గంటలకి పోస్టుమాన్ అందించిన కవర్ని ఆత్రతగా విప్పి చూసింది. అది ఇలా ఉంది.

"చి. సోమేశానికి, కోడలు చి. సౌ. అన్నపూర్ణకి అనేకాశీస్సులు.

నేను పెద్దాడి దగ్గర అమలాపురంలో ఇరవై రోజు లున్నాను. వాడు బాగా మందు లిచ్చాడు. బాగానే ఉంది. నేను రాసిన ఈ ఉత్తరం శ్రద్ధగా చదివి ధైర్యంగా ఉండండి. ఆందోళన చెందకండి. పెద్దాళ్ళని బాగా వృద్ధిలోనికి తెచ్చాను. కానీ, నీ కన్యాయమే చేశాను. పెద్దవాణ్ని నాకు అన్యాయం చేసి, తక్కిన వాళ్ళని బాగు చేశానని నాన్న బాధ పడేవారు. నాన్న పడే బాధ నేనూ పడేవాణ్ణి. నా భారం పూర్తిగా నీ భుజస్కంధాల మీదనే పడటం నా కిష్టం లేదు. నీకూ ముగ్గురు పిల్లలు. చిన్నవాళ్ళు. వాళ్ళ నింకా నువ్వు ప్రయోజకుల్ని చెయ్యాలి. నా కోసం నువ్వు అప్పులు పడి వాళ్ళ భవిష్యత్తుకు భంగం కలిగ చేయుటం నా కిష్టం లేదు. తలి దండ్రులు పిల్లలకి భారం కారాదనేది నేను నేర్చుకున్న పాఠం. నా అనుభవసారం. అందుకే నా శేషజీవితాన్ని ఆ భగవంతుని సేవలకి అంకితం చేయదలుచుకున్నాను. అతని సన్నిధి లోనే అంతం కావాలనే నిర్ణయాని కొచ్చి నా సమస్యకి నేను ఈ పరిష్కారం చేసుకున్నాను. మీ రెవరూ నన్ను బాధ పట్టలేదు. మీరు బాధ పడకండి. అన్నపూర్ణ మనసుని గాయం చేసుకో వద్దని చెప్పు. వెర్రిపిల్ల. దానికేం తెలీదు. ధైర్యం చెప్పు. పిల్ల లందర్నీ సమానంగా పెంచు. అందరికీ ఈ రోజే ఉత్తరాలు రాస్తున్నాను. నా కోసం వెతక వద్దు. పిల్లల్ని జాగ్రత్తగా పెంచు.

—అవధాని."

ఉత్తరం చదువుతూనే బావురుమంది అన్నపూర్ణ. సోమేశం కుర్చీలోనే కూలబడి పోయాడు. *